
epaper.manachourasta.com

# మన చౌరాస్తా

The Complete News way

సంపుటి : 01 | సంచిక : 42 | గురువారం | 30.05.2024



# 43.4° వావిలాల విలవిల..

- దంచికొడుతున్న భానుడు
- ఉక్కపోతతో జనం ఉక్కిరి బిక్కిరి

## జిల్లాలోని అన్ని మండలాల్లో 40 డిగ్రీలపైనే ఉష్ణోగ్రత

**జనగామ, మన చౌరాస్తా ప్రతినిధి :**
మొన్నటి వరకు వర్షాలు పడడంతో ఎండల నుంచి జనానికి కొంత రిలీఫ్ లభించింది. కానీ.. భానుడు మళ్లీ తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా దంచికొడుతున్న ఎండలతో జనం విలవిల్లాడుతున్నారు. ఉదయం 10 తర్వాత బయటకు వెళ్లాలంటేనే జనానికి భయంతో వణికిపోతున్నారు. వడగాలలతో ఇండ్లలోని కూలర్లు, ఏసీలు సైతం పనిచేయని పరిస్థితి నెలకొంది. ఇక బుధవారం జనగామ జిల్లాలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో 40 డిగ్రీలపై ఉష్ణోగ్రత నమోదైంది. జిల్లాలోని జఫర్‌గడ్ మండలం వావిలాలలో 43.4 డిగ్రీల ఉష్ణోగ్రతతో జనం విలవిల్లాడారు.

### అరెంజ్ అలర్ట్...

మే రెండో వారం కూల్ కూల్‌గా గడిచినా.. చివరి వారంలో మాత్రంలో భానుడు నిప్పులు కురిపిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా పెరిగిన ఉష్ణోగ్రతలతో వాతావరణ శాఖ రాష్ట్రానికి అలర్ట్ జారీ చేసింది. నేటి (గురువారం) నుంచి మూడు రోజుల పాటు రాష్ట్రంలో ఎండల తీవ్రత పెరుగుతుందని పేర్కొంది. సాధారణం కంటే రెండు మూడు డిగ్రీలు ఎక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తాడని వెల్లడించారు. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. వృద్ధులు, గర్భిణులు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అత్యవసరమైతేనే తప్ప బయట వెళ్లవద్దని సూచిస్తున్నారు. జూన్ మొదటి వారం వరకు ఇదే పరిస్థితి ఉంటుందని.. నైరుతి రుతుపవనాల రాకతో ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## జిల్లాలో నమోదైన ఉష్ణోగ్రతలు

| గ్రామం | మండలం | ఉష్ణోగ్రత |
|---|---|---|
| వావిలాల | పాలకుర్తి | 43.4 |
| జఫర్‌గడ్ | జఫర్‌గడ్ | 43.3 |
| వడ్లకొండ | జనగామ | 43.0 |
| జనగామ | జనగామ | 42.7 |
| రఘునాథపల్లి | రఘునాథపల్లి | 42.6 |
| కొడకండ్ల | కొడకండ్ల | 42.6 |
| బచ్చన్నపేట | బచ్చన్నపేట | 42.4 |
| లింగాలఘణపురం | లింగాలఘణపురం | 41.9 |
| మల్కాపూర్ | చిల్పూర్ | 41.8 |
| స్టేషన్‌ఘన్‌పూర్ | స్టేషన్‌ఘన్‌పూర్ | 41.5 |
| తాటికొండ | స్టేషన్‌ఘన్‌పూర్ | 41.4 |
| పాలకుర్తి | పాలకుర్తి | 41.3 |
| కోలుకొండ | దేవరుప్పల | 41.2 |
| అబ్దుల్‌నాగారం | తరిగొప్పల | 41.1 |
| నర్మెట | నర్మెట | 40.9 |
| గూడూరు | పాలకుర్తి | 40.8 |
| దేవరుప్పల | దేవరుప్పల | 40.6 |
| పడమటికేశ్వాపూర్ | బచ్చన్నపేట | 40.4 |
| కూనూరు | జఫర్‌గడ్ | 40.4 |
| తరిగొప్పల | తరిగొప్పల | 39.7 |



## సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి

- రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

02



## స్కూల్ పనుల్లో నాణ్యత పాటించాలి

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా

03



# సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి

**◆ పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క**

**హైదరాబాద్, మన చౌరాస్తా :** బంజారల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ సీతక్క కోరారు. బుధవారం హైదారాబాద్ కొంపెల్లిలో ఉన్న సంత్ సేవాలాల్ మహారాజ్‌ను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పని చేశారన్నారు. ఆయన పరమపదించి దాదాపు 200 ఏళ్లు దాటినా మహరాజ్‌ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని పేర్కొన్నారు. అహింసా మార్గాన్ని అవలంబించాలని, అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన బోధనలు ప్రతి ఒక్కరికీ అనుసరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సేవాలాల్ మహారాజ్ గొప్పతనం గురించి, ఆయన చేసిన బోధనలు భవిష్యత్ తరానికి అందేలా కృషి చేయాలని సీతక్క సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మన ప్రతిష్టను దిగజార్చొద్దు

**◆ వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా**




**వరంగల్, మన చౌరాస్తా :** పోలీస్ విభాగం కీర్తి ప్రతిష్టలను దిగజార్చే విధంగా వ్యవహరిస్తే సహించేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులను హెచ్చరించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులతో బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసారు. డీసీపీలు, అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్ఐలు, ఎస్ఐలు పాల్గొన్న ఈ సమావేశంలో సీపీ ముందుగా శాంతి భద్రతలకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. వచ్చే నెల 4న ఏనమాముల మార్కెట్‌లో నిర్వహించే పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఓట్ల లెక్కింపు సజావు నిర్వహించేందుకుగా తీసుకోవాల్సిన బందోబస్తుతో పాటు ఎన్నికల కోడ్ ఉల్లంఘలకు పాల్పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. అదే విధంగా జూన్ 9న నిర్వహించబడే గ్రూప్స్ పరీక్షలను సజావు నిర్వహించేందుకు శాఖ పరంగా తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులను అడిగి తెలుకున్నారు. వర్షకాలం సమీపిస్తున్న వేళ రైతులు నకీలీ విత్తనాల బారీన పడకుండా స్థానిక పోలీసులు తీసుకోవాల్సిన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. నకిలీ విత్తనాల విక్రయాలకు పాల్పడేవారిపై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అనంతరం పోలీస్ కమిషనర్ అధికారులను ఉద్దేశిస్తూ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే ప్రతి పోలీస్ అధికారి నిజాయితీతో పని చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు పోలీసులపై ఉన్న నమ్మకానికి తగ్గట్లుగానే ఉండాలన్నారు. పోలీస్ కమిషనర్‌కు ఎదైనా ఫిర్యాదు చేయాలనుకునే 8712685070 వాట్సప్ నంబర్‌కు మీ ఫిర్యాదులను పోస్ట్ చేవచ్చన్నారు. ఫిర్యాదులపై తగుచర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం పార్లమెంట్, ఉప ఎమ్మెల్సీ ఎన్నికలను సజావు నిర్వహించడంలో కృషి చేసిన పోలీస్ అధికారులకు సీపీప్రశంస పత్రాలను అందజేశారు. సమావేశంలో డీసీపీలు అబ్దుల్‌బారీ, రవీందర్, ఏఎస్పీ అంకిత్, అదనపు డీసీపీలు రవి, సంజీవ్, సురేష్‌కుమార్‌తో పాటు ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.





# ఉత్తమ్‌ను కలిసిన కడియం

**స్టేషన్‌ఘన్‌పూర్, మన చౌరాస్తా :** తెలంగాణ నీటి పారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీ కడియం శ్రీహరి, వరంగల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో కలిసి వారు ముందుగా పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. అనంతరం స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో పెండింగ్‌లో ఉన్న దేవాదుల ప్రాజెక్టు పనులపై మంత్రితో చర్చించారు. నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగు నీటిని అందించటానికి దేవాదుల ప్రాజెక్ట్ పనులను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని, దీనిపై ప్రత్యేక చొరవ తీసుకుని చర్యలు చేపట్టాలని కోరుతూ ఉత్తమ్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్టు కడియం పేర్కొన్నారు.



# పాఠశాలల పనులు తనిఖీ

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్‌లోని మట్టేవాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఇస్లామీయ పాఠశాల, క్రిస్టియన్ కాలనీ ప్రభుత్వ పాఠశాల, గ్రైన్ మార్కెట్ పాఠశాల, యెనుమామూల మార్కెట్ వద్ద గల జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాల తదితర పాఠశాలలను కలెక్టర్ ప్రావిణ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా గుర్తించి జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తెలుసుకున్నారు. చేపట్టిన పనులు నాణ్యతతో గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అంతకుముందు వరంగల్ శివనగర్‌లోని తెలుగుతల్లి మహిళ సమాఖ్య ద్వారా నిర్వహిస్తున్న ఏకరూప దుస్తుల తయారీ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కలెక్టర్ వెంట డీఈఓ వాసంతి ఉన్నారు.




# బాలసదన్‌ను సందర్శించిన జడ్జి

**జనగామ, మన చౌరాస్తా :** జనగామలోని చిల్డ్రన్స్ హోం (బాలసదన్)ను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇ.సుచరిత బుధవారం సందర్శించారు. అక్కడ పిల్లల కష్టసుఖాలపై ఆరా తీశారు. వారు ఎలా చదువుకుంటున్నారు.. ఆహారం ఎలా ఉంది.. అని అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య దృష్ట్యా ప్రతిరోజూ ఉదయం నుంచి సాయంత్రం వరకు ఖచ్చితంగా 8 గ్లాస్ల మంచినీళ్లు తాగాలని సూచించారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ న్యాయవాది ఇట్టబోయిన జ్యోత్స్న, అక్కడి స్టాఫ్ పాల్గొన్నారు.

Local News





# పనుల్లో నాణ్యత పాటించాలి

- ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి
- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా గుర్తించి చేపడుతున్న పనుల్లో నాణ్యత పాటించాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని కొత్త బస్తీలో గల ఎంపీయూపీఎస్, ఉర్దూ మీడియం ఎంపీయూపీఎస్ పాఠశాలలు, శామీర్ పేటలోని జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు, ఎల్లంల ఎంపీపీఎస్ పాఠశాల, బాణాపురం పరిధిలో గల ఎంపీపీఎస్ పాఠశాలల్లో విస్తృత పర్యటన చేపట్టి స్కూళ్లలో కొనసాగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల్లో వేగం పెంచి గడువులోపు పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 291 పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టగా, ఇప్పటికే 93 పాఠశాలల్లో మౌలిక వసతులు, సుందరీకరణ పనులు పూర్తయ్యాయని, మిగతా పాఠశాలల్లో కొనసాగుతున్న మరమ్మతుల పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రధానంగా పాఠశాలల్లో తాగునీరు, మరుగుదొడ్ల నిర్మాణం వంటి ప్రాథమిక అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం రఘునాథపల్లి మండలంలోని ఆశ్వారావుపల్లి, వెల్ది గ్రామాల్లోని ఐకేపీ, పీఏసీఎస్‌ల ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. సేకరించిన ధాన్యం, తరలింపు, తేమ శాతం గురించిన తదితర వివరాలను కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. జూన్ 1 నుంచి రుతుపవనాలు రానున్నందున కొనుగోళ్లను మరింత స్పీడప్ చేయాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతోందని, ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లు ముగింపు దశకు వచ్చినందున, మిగిలి ఉన్న ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలన్నారు. కొనుగోళ్ల వివరాలను వెంటవెంటనే ఓపీఎంఎస్ లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. తద్వారా సకాలంలో రైతులకు చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. ఆయన వెంట డీఈఓ రాము, డీసీఎస్ఓ రోజారాణి, డీఆర్డీఓ మొగులప్ప, డీఎం సీఎస్ ప్రసాద్, డీటీ సీఎస్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.



## భద్రకాళి సన్నిధిలో ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి బుధవారం వరంగల్‌లోని భద్రకాళి అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

*- వరంగల్, మన చౌరాస్తా*

## రక్తదానం చేసిన వాకర్స్

**హనుమకొండ, మన చౌరాస్తా :** గోపాలస్వామి గుడి తోట మైదాన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తల సేమియా వ్యాధిగ్రస్తులైన పిల్లలకు సహాయార్థంగా రక్తదాన శిబిరం బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్‌స్వామి, డివిజన్ కాంగ్రెస్ నేత చిప్ప వెంకటేశ్వర్లు, ఎలుగం సత్యనారాయణ, గోపాల్ స్వామి వాకర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జి.జయప్రకాష్, సెక్రటరీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రెజరర్ పోరండ్ల సాంబయ్య, చల్లా కుమారస్వామి, ఏల్పుల అంజయ్య, పులి ప్రభాకర్, నూనె రాజేశం, జి.రాము, తోట సురేష్, అయిలయ్య, నవ్య శ్రీ, మంజుల, రజిత రక్తదానం చేశారు. ఈ శిబిరం ద్వారా 60 యూనిట్ల రక్తం సమకూరిందని రెడ్ క్రాస్ బృందం తెలిపింది.



# బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు

బచ్చన్నపేట, మన చౌరాస్తా : బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఎస్ఐ కంకల సతీష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం ఆయన ఇక్కడ మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడంతో పాటు కేసులు నమోదు చేస్తామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మందు తాగే వారిపై ప్రజలు పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. మద్యం మత్తులో వాహనాలు నడపవద్దని సూచించారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

- జిల్లా వ్యవసాయాధికారి వినోద్‌కుమార్

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వ్యవయాధికారి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం ఆయన బచ్చన్నపేటలో ఫెర్టిలైజర్ షాపులను తనిఖీ చేసి స్టాక్ రికార్డులు, బిల్ బుక్కులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలతో పాటు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. విత్తన డీలర్లకు విత్తనాలు పర్మిషన్ ఉన్న కంపెనీ నుంచి మాత్రమే తీసుకోవాలన్నారు. సీడ్ లైసెన్స్ కొనుగోలు దారులకు కనిపించే విధంగా పెట్టాలని, ధరల పట్టిక రైతులకు కనిపించే విధంగా ఉంచాలన్నారు. బ్లాక్ మార్కెటింగ్ చేయరాదన్నారు. అదే విధంగా నిషేధిత బీటీ3 విత్తనాలు ఎవరైనా అమ్మితే వ్యవసాయ శాఖ అధికారులకు తెలియజేయాలన్నారు. విత్తనాలు కొన్నప్పుడు తప్పనిసరి బిల్లు తీసుకోవాలని, విత్తనం లాట్ నెంబర్, ఎక్స్‌పరీ డేట్ వివరాలను బిల్లులో ఉండేలా చూసుకోవాలన్నారు. బిల్లుపై రైతు సంతకం, డీలర్ సంతకం తప్పనిసరిగా చేయాలన్నారు. పంట కాలం ముగిసే వరకు విత్తన పాకెట్, రసీదులు దాసి పెట్టాలన్నారు. విత్తనం కొనేటప్పుడు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు సలహాలు తీసుకొని స్థానిక పరిస్థితుల దిగుబడుల ఆధారంగా ఎన్నుకోవాలన్నారు.



# అనుమతిలేని స్కూళ్లపై ప్రకటన ఇవ్వాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం



**జనగామ, మన చౌరాస్తా :** అనుమతిలేని స్కూళ్లపై విద్యాశాఖ ప్రకటన విడుదల చేసి బహిర్గతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జనగామ ఏఓ రవీందర్‌కు ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ఫీజులను బహిర్గతం చేసి నోటీస్ బోర్డులో పెట్టాలని కోరుతూ వినతి ప్రతం అందజేశారు. అనంతరం ధర్మభిక్షం మాట్లాడుతూ జనగామ జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తూ తల్లిదండ్రులను వేధిస్తున్నారని ఆరోపించారు. ట్యూషన్ ఫీజు మొత్తం ముందుగానే చెల్లించాలని తల్లిదండ్రులకు మెసేజ్ పెడుతూ ఇబ్బంది పడుతున్నారన్నారు. జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలో ఫీజులను నోటీస్ బోర్డులో పెట్టి బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఫీజుల నియంత్రణ చట్టం లేకపోవడం వల్ల ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు వారి ఇష్టానుసారంగా ఫీజులు పెంచి వసూలు చేస్తున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సీబీఎస్ పాఠశాలలో అడ్మిషన్ ఫీజులు రూ.5 వేలకు పైగా వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈటెక్నో, ఐఐటీ, ఇంటర్నేషల్, ఒలంపియడ్, డీసీ అని ప్రత్యేక పేర్లు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు దోసగాని సుమ, జిల్లా సహాయ కార్యదర్శి విఘ్నేష్ పాల్గొన్నారు.

## దీపికా, సమంత

# టాప్‌లో..

- ఇండియాలో ఫుల్ ఫ్యాన్స్ ఫాలోయింగ్ ఉన్న హీరోయిన్స్ వీరే..
- ఐఎండీబీ జాబితాలో టాప్ ప్లేస్

**మన చౌరాస్తా, సినిమా :** ఇండియన్ హీరోయిన్స్ హవా మామూలుగా లేదు. ఫ్యాన్స్ ఫాలోయింగ్ ను పెంచుకునేలో ఒకరికొకరు పోటీబ్పడుతున్నారు. ఈ పోటీలో బాలీవుడ్ బ్యూటీ దీపిక పదుకొణె అగ్రస్థానంలో నిలవగా.. టాలివుడ్ యంగ్ హీరోయిన్ సమంత 13 ప్లేస్ లో నిలిచింది. తాజాగా ప్రముఖ ఎంటర్‌టైన్‌మెంట్ పోర్టల్ ఐఎండీబీ 2014 నుంచి 2024 ఎక్కువ ప్రజాదరణ పొందిన ఇండియన్ యాక్టర్స్ జాబితాను విడుదల చేసింది. ఇందులో అగ్రస్థానంలో ఫస్ట్ ప్లేసులో దీపిక, 13వ స్థానాన్ని సమంత కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా దీపికా మాట్లాడుతూ - " ఈ గుర్తింపు నాకు చాలా ప్రత్యేకమైనది. ఇంతమంది ప్రేమను పొందుతున్నందుకు నేను అదృష్టవంతురాలిని" అని చెప్పకొచ్చింది. అలాగే సమంత మాట్లాడుతూ "ఎంతోమంది దర్శకులు, రచయితలు, నిర్మాతల కృషి, ప్రేక్షకుల ప్రేమ వల్లే నేను ఈ స్థానంలో ఉండగలిగాను. నాకు ఇది ఎంతో గర్వంగా ఉంది" అని హర్షం వ్యక్తం చేసింది. ఈ జాబితాలో మొదటి 10 మంది దీపికా, షారుక్, ఐశ్వర్యారాయ్, అలియా, ఇర్ఫాన్ ఖాన్, ఆమిర్, సుశాంత్ సింగ్, సల్మాన్, హృతిక్, అక్షయ్ బాలీవుడ్ స్టార్సే కావడం విశేషం. తెలుగు హీరోయిన్ సమంతతో పాటు తదుపరి వరుసలో మరి కొంతమందికి కూడా స్థానాలు దక్కాయి.



